www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 10 డిసెంబర్ 2024
5



ప్రదీప్ కుమార్‌కు వైవీయూ డాక్టరేట్

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం అప్లయిడ్ మ్యాథమెటిక్స్ శాఖ పరిశోధకులు బి.ప్రదీప్ కుమార్‌కు వైవీయూ డాక్టరేట్ ను ప్రదానం చేసింది. అప్లయిడ్ మ్యాథమెటిక్స్ శాఖ సహ ఆచార్యులు డా.ఎస్.సునీత పర్యవేక్షణలో 'రేడియేషన్ ఎంహెచ్‌డి హైబ్రిడ్ నానోఫ్లూయిడ్స్ ఉష్ణ బదిలీ విశ్లేషణ హీట్ ట్రాన్స్‌ఫర్ అనాలసిస్ ఆఫ్ హైబ్రిడ్ నానో ఫ్లూయిడ్స్ విత్ రేడియేషన్ అండ్ ఎంహెచ్‌డీ' అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కె.ఎస్.వి.కృష్ణారావు ప్రకటించారు. ప్రదీప్ కుమార్ రాసిన పరిశోధన వ్యాసాలు పలు జాతీయ జర్నల్‌లలో ప్రచురితమయ్యాయి. డాక్టరేట్ పొందిన ప్రదీప్‌కుమార్‌ను విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి,మ్యాథమెటిక్స్ శాఖ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, మిత్రులు అభినందించారు.

భూ సమస్యలకు చెక్

- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత

ప్రజాశక్తి - కమలాపురం టౌన్

రెవెన్యూ సదస్సుల ద్వారా 45 రోజుల్లోనే భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని మంత్రి ఎస్. సవిత పేర్కొన్నారు. కమలాపురం మండలం చిన్నచెప్పలి సచివాలయం ఆవరణలో గ్రామంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సును సవితమ్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రితో పాటు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, కమలాపురం ఎమ్మెల్యే పి.కృష్ణ చైతన్య, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రజల నుంచి అర్జీలను మంత్రి స్వీకరించారు. గ్రామసభ వద్ద ఏర్పాటు చేసిన అర్జీ నమోదు కౌంటర్, రెవెన్యూ రికార్డుల కౌంటర్, రెవెన్యూ శాశ్వత రికార్డుల కౌంటర్లను వారు పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 2025 జనవరి 8వ వరకూ 33 రోజులపాటు, సుమారు 17 వేలకు పైగా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు షెడ్యూల్ ప్రకారం జరుగుతున్నాయన్నారు. 2019కి ముందు భూముల రికార్డులు ఎలా ఉన్నాయి? ప్రస్తుతం ఎలా ఉన్నాయో పరిశీలిస్తున్నామని చెప్పారు. కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ ప్రతి అధికారి, ప్రజా ప్రతినిధి సమన్వయం, జవాబుదారీ తనంతో పని చేస్తేనే గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావన్నారు. రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రభుత్వ సేవలన్నీ పూర్తిగా ఉచితంగా పొందవచ్చునని చెప్పారు. వీలైనంత వరకు అక్కడికక్కడే సమస్యలను పరిష్క రించేందుకు ప్రాధాన్యతను ఇస్తున్నామని చెప్పారు. కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి పాలనలో జిల్లా యంత్రాంగం సహాయ సహకారాలతో కమలాపురం నియోజకవర్గాన్ని వ్యవసాయ, విద్య, వైద్య, ఇరిగేషన్, ఉపాధి, పారిశ్రామిక రంగాలలో ప్రథమ స్థానంలో నిలపడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారు. కార్యక్రమంలో కడప ఆర్డిఒ జాన్ ఇర్విన్, మండల స్పెషల్ ఆఫీసర్ సుబ్బారెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ పివిఎస్ బాబు, ల్యాండ్ సర్వే ఎడి మురళీకృష్ణ, తహశీల్దార్ శివరామిరెడ్డి, ఎంపిడిఒ జ్యోతి, రెవెన్యూ టీమ్ మెంబర్లు, స్థానిక నాయకులు, అర్జీదారులు, ప్రజలు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని వినతి

అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ సదస్సుకు హాజరైన మంత్రి సవితకు యూనియన్ అధ్యక్షులు లక్ష్మీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. రేషన్ డీలర్ల అక్రమాలతో బియ్యం, కందిపప్పు, నూనె వంటి నిత్యావసరాల సక్రమంగా సెంటర్లకు అందడం లేదని వాపోయారు. వచ్చిన అరకొర సరుకులు నాణ్యత లేకపోవడంతో ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయని పేర్కొన్నారు. డీలర్ల నుండి వస్తువులు నాణ్యమైనవి అందజేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. అంగన్వాడీ టీచర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు.

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ప్రజల భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని 45 రోజుల్లో వినతులకు పరిష్కారాలు చూపు తామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాష్ట్ర బిసి, ఇడబ్ల్యుఎస్, సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పిలుపునిచ్చారు. సోమవారం నియోజక వర్గ పరిధిలోని దొరసానిపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే వరదరా జులరెడ్డితో కలిసి మంత్రి ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు ఇచ్చిన అర్జీలలో పరిష్కరించదగినవి వెంటనే పరిష్కరిస్తామన్నారు. పరిష్కరించలేనివి పరిశీలించి 45 రోజుల్లో తప్పక పరిష్కారం చూపుతామని తెలిపారు. గత ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేశామన్నారు. జెసి అదితి సింగ్ మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మన జిల్లాలో ఈ నెల 6 నుంచి నుండి అన్ని మండలాల్లో ఈ రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో వచ్చే అర్జీలలో దాదాపు 70 శాతం భూ సమస్యలే ఉన్నా యన్నారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరా జుల రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రజా సంక్షే మానికి, రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిరంతరం అభివృద్ధి, సంక్షేమానికి పాటు పడుతున్నారని చెప్పారు. సమావేశంలో ఆర్‌డిఒ సాయిశ్రీ, తహశీల్దార్ గంగయ్య, సర్పంచ్ అరవ ఈశ్వరమ్మ, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, అధికారులు పాల్గొన్నారు.



కమలాపురం : రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి సవిత

మున్సిపల్ ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని వినతి

మున్సిపల్ ఆప్కాస్ కార్మికులను పర్మనెంట్ చేయాలని, మున్సిపల్ యూనియన్ పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మన్ తెలిపారు. స్థానిక దొరసానిపల్లిలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవితకు మున్సిపల్ కార్మికుల సమస్యలపై వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ ఆప్కాస్ కార్మికలందరినీ పర్మనెంట్ చేసి, జీతాలు పెంచాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. మున్సిపల్ కార్మికులకు ఇళ్లస్థలాలు ఇచ్చి ప్రభుత్వమే ఇల్లు కట్టించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్. రవి కుమార్, పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె : మండలంలోని కె.ఓబులంపల్లి రెవెన్యూ గ్రామానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలలో తహశీల్దార్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రైతులకు, ప్రజలకు ఏవైనా సమస్యలుంటే సదస్సుల ద్వారా పరిష్కరించు కోవాలని పేర్కొన్నారు. అనంతరం రైతులనుండి భూ సమస్యలకు సంబంధించి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ నాగభూషణంరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ యూనస్‌బాషా, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆదిరాజు, జూనియర్ సహాయకులు ధీరజ్, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

కాశినాయన : రెవెన్యూ సదస్సులో వచ్చే ప్రతి భూ సమస్య అర్జీని త్వరగా పరిష్క రించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని టిడిపి యువ నాయకులు రితీష్ రెడ్డి పేర్కొన్నారు మండల పరిధిలోని ఉప్పులూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు రవీంద్రారెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ రవిశంకర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అమర్‌నాథరెడ్డి, విఆర్ఓ సుబ్బరాయుడు, రెవెన్యూ స్బిబంది, ప్రజలు పాల్గొన్నారు.

కడప ఉక్కు కోసం నిరవధిక పోరాటాలు

- డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినూత్న నిరసన

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప ఉక్కు కోసం నిరవధిక పోరాటాలు సాగిస్తామని విద్యార్థి, యువజన సంఘం నాయకులు తెలిపారు. కడప ఉక్కుపై పార్లమెంటులో కేంద్ర ఉక్కు శాఖా మంత్రి వ్యాఖ్యలు నిరసిస్తూ సోమవారం కడప కలెక్టరేట్ వద్ద వినూత్న రీతిలో చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరణాలశివకుమార్, ఎద్దురాహుల్, వీరపోగు రవి మాట్లాడుతూ కడప ఉక్కు పైన కేంద్ర వైఖరి దారుణంగా ఉందన్నారు. కడప ఉక్కు ను టెంకాయల పరిశ్రమగా మార్చారని విమర్శించారు. ప్రభుత్వాలు, ముఖ్యమంత్రులు మారుతున్నా కడప ఉక్కు రాత మారడం లేదన్నారు. వెనుకబడిన రాయలసీమ లాంటి ప్రాంతాలలో భారీ ఉక్కు పరిశ్రమ చాలా అవసరమని చెప్పారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గడిచిన పదేళ్లల్లో కడప ఉక్కుకు ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించలేదన్నారు. వెంకన్న సాక్షిగా ఇచ్చిన హామీని కేంద్రం నిలబెట్టుకోలేదని తెలిపారు. రాష్ట్రంలోని ఎంపీలు సైతం పార్లమెంటులో కడప ఉక్కు పైన మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. గతంలో వైసిపి, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కానీ కేంద్రాన్ని ఎదిరించి కడప ఉక్కుకు నిధులు రాబట్టలేక పోయారన్నారు. ఓటు బ్యాంకుగానే చూస్తున్నారే తప్ప కానీ ఇక్కడి యువత భవిష్యత్‌ను ఆలోచించడం లేదని ఆవేదన చెశారు. రాష్ట్ర ఎంపీలు కడప ఉక్కు పై గళం విప్పాలని ,అవసరం అయితే తమ పదవులకు రాజీనామా చేసి కేంద్రం పైన ఒత్తిడి తేవాలన్నారు. తమ పోరాటాలలో భాగస్వామ్యం కావాలని ప్రజా ప్రతినిధులకు పిలుపునిస్తున్నామన్నారు. లేకుంటే ఇక్కడి యువత తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కడప ఉక్కు కోసం రాబోవు రోజులలో నిరవధిక ఉద్యమాలు సాగిస్తామని స్పష్టం చేశారు. అనంతరం కలెక్టర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర కార్యదర్శి విజయ్, జిల్లా సహాయ కార్యదర్శి ఆదిల్, ఉపాధ్యక్షులు రెబ్బ.నరసింహులు, ఉదయ్, వంశీ, ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీ,అభినయ్,నిత్యా, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద చెవిలో పూలు పెట్టుకుని వినూత్నంగా నిరసన తెలుపుతున్న నాయకులు

లక్ష్మీపేటలో సామాజిక పింఛన్ల తనిఖీ

తూతూ మంత్రంగా నిర్వహించిన బృందం



చెట్టుకింద కూర్చొని సర్వే చేస్తున్న బృందం సభ్యులు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని లక్ష్మీపేటలో సోమవారం వితంతు, వికలాంగ, వృద్ధాప్య వంటి సామాజిక పింఛన్లలో అనర్హులను గుర్తించేందుకు ఇతర మండలాలకు చెందిన మండల స్థాయి అధికారుల సమక్షంలో తనిఖీ నిర్వహించారు. గ్రామంలో మొత్తం 400 మంది పెన్షన్లకు సంబంధించి డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్ ఆధ్వర్యంలో పదిమంది టీం సభ్యులను ఏర్పాటు చేసి సర్వే చేపట్టారు. ఈ టీమ్‌లో ఎంపిడిఒ, ఎఒ, ఆర్డబ్ల్యుఎస్ ఎఇలు, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు ఉన్నారు. ఒక్కొక్క టీంలో ఒక మండల స్థాయి అధికారి, ఒక సచివాలయ సిబ్బంది ఉన్నారు. పెన్షన్ లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి వారికి పెన్షన్ వచ్చేందుకు ఉన్న అర్హత వివరాలను అడిగి తెలుసుకున్నారు. అందుకు సంబంధించిన అర్హత పత్రాలను పరిశీలించారు. మొత్తం 400 పెన్షన్లను తనిఖీ చేసి 380 మంది పెన్షన్ దారుల వివరాలను ఆన్‌లైన్ చేశారు. 20 మంది పింఛనుదారుల ఇంటి వద్ద అందుబాటులో లేకపోవడంతో మంగళవారం సర్వే చేస్తామని అధికారులు తెలిపారు. సర్వే పూర్తయిన 380 మంది పెన్షన్ దారులలో అర్హుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని తెలిపారు.

చెట్ల కింద కూర్చొని తూతుమంత్రంగా..

వీరభద్రాపురంలో చేపట్టిన సామాజిక పింఛన్ల తనిఖీ బృందం సభ్యులు చెట్ల కింద అరుగుపై కూర్చొని తూతూ మంత్రంగా నిర్వహించారు. పెన్షన్ లబ్ధిదారులను గుంపుగా చేసుకొని సర్వేను పూర్తి చేశారు. పెన్షన్ లబ్ధిదారులు తాము చెప్పిన వివరాలను చుట్టపు చూపుగా విని వారి పనిని ముగించుకొని వెళ్లిపోయారు. కొన్ని టీములలో మండల స్థాయి అధికారులు డుమ్మా కొట్టగా సచివాలయ సిబ్బంది తమకు కేటాయించిన లబ్ధిదారుల వివరాలను సేకరించుకొని సర్వే పూర్తి చేశారు. ప్రభుత్వం పెన్షన్లలో అనర్హులను గుర్తించేందుకు నిర్వహించిన కార్యక్రమం పూర్తిగా వైఫల్యం చెందని ప్రజలు చర్చించుకుంటున్నారు. కొండను తవ్వి ఎలుకలు పట్టిన చందంగా సర్వే ఉందని పలువురు వాపోతున్నారు.

విచారణకు హాజరైన కడప ఎంపీ పిఎ రాఘవరెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి పిఎ రాఘవరెడ్డి సోమవారం పోలీసుల విచారణకు హాజరయ్యారు. ఆయనకు ఇటీవల పోలీసులు 41ఎ నోటీసులు ఇచ్చారు. కడప సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌కు విచారణకు వచ్చారు. వైసిపి సామాజిక కార్యకర్త వర్రా రవీందర్‌రెడ్డి కేసులో రాఘవరెడ్డి ఆరోపణలు ఎదుర్కొటున్నారు. సోషల్ మీడియాలో వైఎస్.సునీత, వైఎస్.షర్మిల, వైఎస్.విజయమ్మపై అనుచిత పోస్టుల వ్యవహారంపై గత నెలలో తొలిసారి ఎంపీ అవినాష్‌రెడ్డి పిఎ రాఘవరెడ్డి ఇంటికి పోలీసులు నోటీసులు అంటించారు. నోటీసులతో ముందస్తు బెయిల్ కోసం రాఘవరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈనెల 13వ తేదీ వరకు రాఘవరెడ్డిపై ఎలాంటి తీవ్ర చర్యలు తీసుకోవద్దని హైకోర్టు సూచించింది. సోమవారం ఆయన పులివెందులకు రావడంతో పోలీసులు నోటీసులిచ్చారు. ప్రస్తుతం పోలీసు స్టేషన్‌లో రాఘవరెడ్డిని పులివెందుల డిఎస్‌పి మురళీ నాయక్ విచారిస్తున్నారు.

సోషల్ మీడియా కేసుల్లో విచారణకు సహకరించేంత వరకూ ఎటువంటి ఇబ్బంది ఉండదని జిల్లా ఇన్‌ఛార్జి ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు పేర్కొన్నారు. సోషల్ మీడియా కేసుల్లో అందరికీ నోటీసులు ఇస్తున్నామని తెలిపారు. ఇదీలా ఉండగా ఎవరు చెబితే కంటెంట్‌ను వర్రా రవీంద్రారెడ్డికి ఇచ్చావని ఎస్‌పి రాఘవరెడ్డిని ప్రశ్నించినట్లు తెలిసింది. ఇంకా ఎవరెవరికి పోస్టింగ్‌లు చేయించావు, వర్రాకు, నీకు ఉన్న సంబంధం ఏమిటన విషయాలపై లోతుగా విచారించినట్లు సమాచారం.



రాఘవరెడ్డిని విచారిస్తున్న సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ మధుమల్లేశ్వర్‌రెడ్డి

బినామీదార్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లాలో ఎరువులు, మందులు, విత్తనాలు బినామీ దారులు షాపులు నిర్వహిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవడంలో మండల వ్యవసాయ శాఖ అధి కారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని ఎపి రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి తెలిపారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక లో వ్యవసాయ శాఖ జిల్లా అధికారిని కలసి వినతిపత్రం సమర్పించారు. కడపలో ఒక షాపు లైసెన్సు దారుడు చనిపోయి 6 నెలలు అవుతుందని, ఆ షాపు బినామీ దారులు నడుపుతున్నా మండల వ్యవసాయ శాఖ అధికారి ఏమాత్రం పట్టించుకోవడం లేదని తెలిపారు. మైదుకూరు, జీవి సత్రం, పెండ్లిమరి, సికె దిన్నె, కడప మండలాలలో షాపులు నిర్వహిస్తున్న వారు అగ్రికల్చర్ బిఎస్‌సి చదివిన వారు లేరని పేర్కొన్నారు. లైసెన్స్ ఒకరి పేరు మీద, షాపులు బినామీదారులు నిర్వహిస్తున్నారని చెప్పారు. వీటన్నిటి పైన సమగ్ర విచారణ జరపాలని కోరారు. శాంపిల్స్, స్టాక్ ,ఆడిట్ నిర్వహణ మండల వ్యవ సాయశాఖ అధికారులు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. నిషేధిత గ్లైసిల్ గడ్డి మందు, బయోలు అమ్ముతున్నా చూసి చూడనట్లు అధికారులు ఉన్నారని పేర్కొన్నారు. వీటి పైన జిల్లా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో యువరైతు నరసింహ ఉన్నారు.

మేనిఫెస్టోను విస్మరించిన కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి -కమలాపురం టౌన్ : ఎన్నికల సమయంలో కూటమి నాయకులు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించారని వైసిపి జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిందని, ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి వారిని మోసం చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమైందని వాపోయారు. మైనింగ్ కూడా ఆన్‌లైన్ ద్వారా పరిమితులు జారీ చేసిన పరిస్థితి లేదు. రైతు భరోసా కేంద్రాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. చిన్న చెప్పలిలో టిడిపి మంత్రి రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దుర్మార్గపు పాలనకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. సమావేశంలో రాజశేఖర్ రెడ్డి చెన్నకేశవరెడ్డి సుబ్బారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సాధక్ భాషా. కొండారెడ్డి పాల్గొన్నారు

చైర్మన్‌కు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహమ్మద్ ప్రమాణస్వీకార మహోత్సవం సందర్భంగా ఎన్ఆర్ఐ తెలుగుదేశం కువైట్ ఉపాధ్యక్షులు షేక్. రహమతుల్లా పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రహమాతుల్లా మాట్లాడుతూ అటు తెలుగుదేశం పార్టీ, ఇటు కూటమి ప్రభుత్వం ముస్లిం మైనార్టీల పక్షపాతి అని మరోసారి రుజువైందన్నారు. మౌలానా ముస్తాక్ అహ్మద్‌ను మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ చేయడంతో మైనార్టీ సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ మైనార్టీలకు అండగా ఉంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యదర్శి ఖాదర్ బాషా, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చైర్మన్‌ను అభినందిస్తున్న రహమతుల్లా

ఆర్మీ ఫ్లాగ్ డే ఫండ్‌కు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్మీ ఫ్లాగ్ డే ఫండ్‌ను ప్రజా విరాళాలతో కాకుండా ప్రత్యేక బడ్జెట్ కేటాయింపుల ద్వారా సమకూర్చాలని ఉమ్మడి జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు పి.లక్ష్మీనారాయణ కోరారు. సోమవారం ఆర్మీ ఫ్లాగ్ డే సందర్భంగా నాగరాజుపేటలో మున్సిపల్ ప్రాథ మిక పాఠశాలలో పలువురు విద్యార్థులకు నోట్, కాపీ రైటింగ్ పుస్తకాలు, పెన్నులు, చాక్లెట్లు, రైటింగ్ మెటీరియల్, స్వీట్స్ జిల్లా మాజీ సైనిక సంఘం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బి.వి.గోపాల్ రెడ్డి, కోశాధికారి బి. శేషారాంసింగ్ ఉన్నారు.



రిలే దీక్షలు చేస్తున్న న్యాయవాదులు

న్యాయవాదుల రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి - కడప

ఈగల్ ఫాస్ట్ ట్రాక్ కోర్టులు తిరుపతిలో ఏర్పాటు చేయడం శోచనీయమని కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు బొగ్గుల గుర్రప్ప నాయుడు అన్నారు.ఈగల్, ఫాస్ట్ ట్రాక్ కోర్టులు తిరుపతిలో ఏర్పాటు చేయడానికి నిరసిస్తూ సోమవారం కడప బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడప జిల్లా కోర్టు ఎదురుగా రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాయలసీమ నడిబొడ్డున కడపలోఈగల్, ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయకపోవడం సబబు కాదన్నారు. డ్రగ్స్, గంజాయి, ఎర్రచందనం కేసుల సంబంధిత కోర్టులు తిరుపతిలో పెట్టడం వల్ల అక్కడి పవిత్రత దెబ్బతింటుందన్నారు. కోర్టులను తిరుపతికి తరలిస్తే కక్షిదారులు, న్యాయవాదులు వ్యయ ప్రయాసలకు గురి కావలసి వస్తుందన్నారు. దీక్షలో ఉపాధ్యక్షులు చంద్రమోహన్, న్యాయవాదులు వెంకటసుబ్బయ్య, రాజగోపాల్ రెడ్డి, రాజశేఖర్ కూర్చున్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు సౌకర్యాలు కల్పిస్తాం

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

విభిన్న ప్రతిభావంతుల పిల్లలకు సౌకర్యాలు కల్పిస్తామని ఎంఇఒలు వెంకట్రామిరెడ్డి, రమాదేవి పేర్కొన్నారు. ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా మండలంలోని భవిత కేంద్రంలో సోమవారం కార్యక్రమం నిర్వహించారు ముఖ్యఅతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల్లో అపారమైన ప్రతిభ దాగి ఉంటుందని చెప్పారు. పిల్లలకు విద్యతోపాటు స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీతోపాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. విద్యార్థులు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మూల వంక తెలుగు టీచర్ వెంకటేశ్వర్లు, ప్రసన్నదేవి, ఐఇఆర్‌పిఎస్ ఎస్. షకీరా బేగం, ఎం వసుధ, ఫిజియోథెరపిస్ట్ కోప్లీ భాను, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ అన్నం రాజు ప్రతాప్ పాల్గొన్నారు.



విజేతకు బహుమతి అందజేస్తున్న అధికారులు

పంటల బీమాను

సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె : మామిడిలో పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవన శాఖాధికారి కె. జ్యోతిర్మయి పేర్కొన్నారు. సోమవారం మామిడిలో సస్యరక్షణ, పంటల బీమాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా అనే సంస్థ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కాలానుగుణంగా వాతావరణంలో వచ్చే ప్రతికూల మార్పులతో పంట నష్టం జరిగితే ఆర్థిక నష్టాల నుండి రైతులను ఆదుకునేందుకు బీమాను ప్రవేశపెట్టారన్నారు. కడప జిల్లాలో మామిడి పంటకు ఈ నెల 15లోగా ప్రీమియం చెల్లించాలని రైతులకు సూచించారు. ఎకరాకు రూ.2,100 ప్రీమియం చెల్లిస్తే, పంటనష్టపోతే, రూ.42వేలు వరకు బీమా వర్తిస్తుందన్నారు. రైతులు బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, ఆధార్ కార్డు, భూమి పాస్‌బుక్, పంట వేసినట్టు ధ్రువీకరణ పత్రం జిరాక్సులు ఉండాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఉద్యమ నేతకు పట్టం కట్టిన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యమ నేతకు ఉపాధ్యాయులు పట్టం కట్టారని యుటిఎఫ్ నాయకులు పేర్కొ న్నారు. ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతిని పురస్కరించుకుని కడప యుటిఎఫ్ భవన్ లో వర్ధంతి కార్యక్రమం నిర్వహి ంచారు. అనంతరం ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందిన గోపి మూర్తి విజయో త్సవ సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యుటిఎఫ్ రాష్ట్ర ట్రెజరర్ బొర్రా గోపి మూర్తి మొదటి ప్రాధాన్యత ఓట్లతో గెలవడం పట్ల యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీ రాజ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 17 ఉపాధ్యాయ సంఘాలు ఒకవైపు యుటిఎఫ్ ఒకటి ఒకవైపు పోటీలో నిలిచిందన్నారు. ఎన్నో ప్రలోభాలకు గురిచేసినప్పటికీ ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యా యులు ఉద్యమ నాయకునివైపు మొగ్గి ఉద్యమాలకు ఊపిరలూదారన్నారు. స్వర్ణో త్సవ సంబరాలకు సిద్ధమవుతున్న తరుణంలో ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయులు ఇచ్చిన అఖండ విజయం యుటిఎఫ్ ఉద్యమానికి మరింత బలం చేకూర్చిందని చెప్పారు. ఈ విజయం యుటిఎఫ్ భవిష్యత్ కర్తవ్య పోరాటాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సహాధ్యక్షులు సుజాత రాణి, జిల్లా కార్యదర్శులు ఏజాస్ అహ్మద్,సివి రమణ, రాష్ట్ర కౌన్సిలర్స్ కృష్ణారెడ్డి, రూతు ఆరోగ్య మేరీ, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు సమీర్ బాష, గోపీనాథ్, చంద్ర శేఖర్, అబ్దుల్ గని, కరిముల్లా, శంకర్ రెడ్డి, శివకుమార్ రాజు, శివశంకర్, బాబు జి.వెంకటసుబ్బయ్య, జమాల్ బాషా, దేవదత్తం పాల్గొన్నారు.



సంబరాలు చేసుకుంటున్న యుటిఎఫ్ నాయకులు

శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యలపై కార్పొరేటర్ల మండిపాటు

ప్రజాశక్తి - కడప అర్బన్ : టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కార్పొరేటర్లు మండిపడ్డారు. సోమవారం డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి ఛాంబర్లఓ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి కార్పొరేటర్లు మాట్లాడుతూ 70ఏళ్ళ చరిత్రలో ఎవరు నగరంలో నీటి సమస్య తీర్చే ప్రయత్నం చేయలేదని తెలిపారు. కడపకు నీరు ఇచ్చిన ఘనత అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నీరు రావడం లేదంటున్న టిడిపి జిల్లా అధ్యక్షులు ప్రజల్లోకి వస్తే వారినే అడుగుదామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమృత్ పథకం కింద రూ.523కోట్లు నిధులు తెచ్చిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మరి ఆ పనులు చేయించుకోవాల్సిన బాధ్యత అధికారంలో ఉన్న టిడిపికి లేదా అని ప్రశ్నించారు. కాంట్రాక్ట్ ఎవరు తీసుకున్న మెడలు వంచి పని చేయించుకునే బాధ్యత అధికారంలో ప్రభుత్వంపై ఉందన్నారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు.

యువతి హత్యాయత్నం కేసులో ఉన్మాది అరెస్టు

ప్రజాశక్తి - కడప అర్బన్ : వేముల మండలం, వి.కొత్తపల్లి గ్రామం ఎస్‌సి కాలనీలో ప్రేమ పేరుతో యువతిపై కత్తితో దాడి చేసి హత్యయత్నానికి ఒడిగట్టిన ఉన్మాదిని అరెస్టు చేసినట్లు ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు తెలిపారు. సోమవారం పెన్నార్ కాన్ఫరెన్స్ హాల్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24 గంటల్లోనే ఉన్మాదిని అరెస్టు చేశామని పేర్కొన్నారు. కులాయప్పనే నిందితుడు షర్మిల అనే అమ్మాయిని ప్రేమ పేరుతో వేధించేవాడని చెప్పారు. నిందితుడు ఇంటిలోకి ప్రవేశించి అమ్మాయిని కత్తితో విచక్షణా రహితంగా దాడి చేశారని తెలిపారు. ఈనెల 7న వేముల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. పులివెందుల డిఎస్‌పి, ఆర్కే వ్యాలీ సిఐ వేముల ఎస్సై బృందాలుగా విడిపోయి నిందితుడి ఆచూకీ కొరకు గాలించారని తెలిపారు. సోమవారం సాయంత్రం కడప వన్ టౌన్ పరిధి ఎర్రముక్కపల్లి సర్కిల్లో నిందితుడిని పట్టుకున్నారని పేర్కొన్నారు. షర్మిలను చంపాలనే ఉద్దేశంతో కత్తితో దాడి చేశారని చెప్పారు. నేరానికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారని తెలిపారు.

చక్రాయిపేట మండలంలోని గండి కొవ్వూరు దళితవాడలో ఈ నెల 6న మురుగునీరు గురించి దండు యోగాంజనేయులుతో పక్కింటిలో ఉన్న నాగార్జున, అతని తల్లి, చెల్లెలు గొడవ పడి కట్టెతో కొట్టి హత్య చేశారని పేర్కొన్నారు. చక్రాయపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయిందని చెప్పారు. ఆర్కే వ్యాలీ సిఐ పులసయ్య, చక్రాయపేట ఎస్ఐ కృష్ణయ్య, పంచాయతీ పెద్దల సమక్షంలో నిందితులు నాగార్జున సావిత్రమ్మ నాగమణిని అరెస్టు చేశారని తెలిపారు.

సాహిత్య సంపద పరిరక్షణ అందరి బాధ్యత : కలెక్టర్

ప్రజాశక్తి - కడప అర్బన్ : భాష, సాహిత్య సంపదను భావితరాలకు వారసత్వ సంపదగా అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. సోమవారం సి.పి.బ్రౌన్ సాహిత్య పరిశోధన గ్రంథాలయాన్ని సందర్శించారు. ముందుగా యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధంగా ఉన్న సి.పి.బ్రౌన్ భాషా పరిశోధనా కేంద్రంలో జానుమద్ది సాహితీపీఠం వారి సౌజన్యంతో ప్రతిష్ఠించిన తెలుగు సూర్యుడు, తెలుగు భాషా సముపార్జకుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ విగ్రహాన్ని పరిశీలించారు. అనంతరం సి.పి. బ్రౌన్ పరిశోధన కేంద్రంలో ఏర్పాటు చేసిన ఛాయాత్రాలను ఒక్కొక్కటిగా తిలకించారు. గ్రంథాలయంలో నిక్షిప్తం చేసిన అమూల్యమైన, వెలకట్టలేని పురాతన తాళపత్ర గ్రంథ నిధిని, పరిశోధనా గ్రంథాలను, పలు రకాల గ్రంథాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు భాషా సాహితీ సౌరభంలో మణి దీపంలా వెలుగొందుతున్న సి.పి.బ్రౌన్ భాషా పరిశోధనా కేంద్రాన్ని సందర్శించడం తనకు చాలా సంతృప్తినిచ్చిందన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధంగా ఉన్న సి.పి.బ్రౌన్ భాషా పరిశోధనా కేంద్రం విస్తరణాభివృద్ధికి, యూనివర్సిటీ భాషా పరిశోధక యంత్రాంగం చేస్తున్న సేవలు అభినందనీయం అన్నారు. చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ సేవలు తెలుగు భాషా సాహితీవేత్తలకు ఆదర్శనీయం అన్నారు. కార్యక్రమంలో కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్, కెఎంసి కమిషనర్ మనోజ్ రెడ్డి, బ్రౌన్ గ్రంథాలయ సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, బ్రౌన్ గ్రంథాలయ సంచాలకులు డాక్టర్ జి. పార్వతి, లైబ్రరీ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

క్రమంగా వైద్య పరీక్షలు చేయించుకుని, పౌష్టికాహారం తీసుకోవాలని పిహెచ్సి వైద్యాధికారి కరిష్మా గర్భిణులకు సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్యాధికారి కరిష్మా ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు పలు పరీక్షలు చేశారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ వైద్యుల సలహాల మేరకు రోజూ వ్యాయామం చేయాలన్నారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. ఆకుకూరలు, ఆహారం, గ్రుడ్లు, పాలు, విటమిన్స్, ఖనిజ లవణాలు, కొవ్వు పదార్థాలు, ప్రోటీన్స్ కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. ప్రమాదకర గర్భిణులు వైద్యుల పర్యవేక్షణలో క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు సురక్షితమన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, సూపర్‌వైజర్లు శోభా కుమారి, రామారావు, ల్యాబ్ టెక్నీషియన్ జాసన్, ఫార్మాసిస్ట్ జగదీశ్, స్టాఫ్ నర్సులు రమాదేవి, రాణి, ఎమ్ఎల్‌హెచ్‌పిలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖాజీపేట : గర్భిణులు వైద్య పరీక్షలు తప్పక చేయించుకోవాలని మండల వైద్య అధికారి ప్రీతి సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యాధి నిరోధక టీకాల నమోదు, గర్భిణుల వివరాల నమోదును పరిశీలించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిపేలా సిబ్బంది కష్టపడి పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ నాగభూషణం, ఆశ నోడల్ అధికారి అరుణకుమారి, పర్యవేక్షకులు కృష్ణప్రియ, శోభన్‌బాబు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ స్వర్ణలత సిబ్బంది పాల్గొన్నారు.

వార్డు మెంబర్లకు విలువ ఇవ్వని పారిశుధ్య మేస్త్రీ..!

ప్రజాశక్తి - వేంపల్లె

పంచాయతీలో ఉన్న వార్డు మెంబర్ల మాటకు పారిశుధ్య మేస్త్రీ మల్లికార్జున విలువ ఇవ్వడం లేదని వార్డు మెంబరు ముత్యాల ఆంజనేయులు పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా పరిషత్ బాలుర పాఠశాల, శ్రీ చైతన్య పాఠశాలకు వెళ్లే రహదారిలో ఉన్న చెత్తతొట్టిలో ఉన్న చెత్తను పూర్తిగా తొలగించాలని పారిశుధ్య మేస్త్రీ మల్లికార్జునకు పలుమార్లు చెప్పినా పెడచెవిన పెడుతున్నారని తెలిపారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యంగా మేస్త్రీ వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు. ఫోన్ చేసిన ప్రతిసారి గుట్టపైన పనులు చేస్తున్నట్లు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని తెలిపారు. అధికారుల భయం లేకపోవడంతోనే మేస్త్రీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. వేంపల్లె పంచాయతీలో వంద మంది సిబ్బంది ఉన్నా పనులు సరిగా చేయడం లేదన్నారు. గత ప్రభుత్వ పాలనలో మురుగు కాలువలు నెలకు రెండు సార్లు శుభ్రం చేసే వారన్నారు. ప్రస్తుతం గ్రామంలో పారిశుధ్య పనులు సరిగా చేయడం లేదన్నారు. బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లడం లేదన్నారు. దోమలు విపరీతంగా పెరిగి వ్యాధులు వ్యాప్తిస్తున్నట్లు తెలిపారు. వార్డు సభ్యుల మాటకు విలువ ఇచ్చి పారిశుధ్య పనులు ప్రజలకు ఉన్న ఇబ్బందులను తొలగించాలని ఆయన కోరారు. అధికారులు, సర్పంచ్‌లు పారిశుధ్య మేస్త్రీ వ్యవహరిస్తున్న తీరుపై చర్యలు తీసుకోవాలన్నారు.

అర్హులకు సాగుభూమి, ఇంటి స్థలం ఇవ్వాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

అర్హులైన పేదలకు సాగుభూమి, ఇంటి స్థలాలు పంచేవరకు పోరాటం ఆగదని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం గిరిజన సంఘం, డిహెచ్‌పిఎస్, డికెఎస్ సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్ర మాట్లాడుతూ అర్హులను గుర్తించకపోతే కలెక్టరేట్ ముట్టడి తప్పదన్నారు. డికెటి మాఫియా కనుసన్నల్లో ప్రభుత్వ భూములున్నాయన్నారు. ఎన్నికల ముందు పాలక ప్రభుత్వాలు అర్హులైన వారికి రెండు ఎకరాల సాగు భూమి, ఇంటి స్థలాలు ఇచ్చి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారన్నారు. అధికారంలోకి రాగానే విస్మరించడం పరిపాటిగా మారిందన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామయ్య, సుబ్బరాయుడు, చంద్రశేఖర్, సిపిఐ జమ్మలమడుగు కార్యదర్శి [illegible], గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి మునయ్య, అధ్యక్షులు ఇమ్మాన్యుయేల్, నాగేశ్వరరావు, సిపిఐ ఏరియా నాయకులు మనోహర్ బాబు, వెంకటరమణ, కృష్ణ, మధు, శ్రీనివాసులు, సుబ్బన్న, గురుస్వామి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్ పాల్గొన్నారు.

రికార్డులు పక్కాగా నమోదు చేయాలి

ప్రజాశక్తి - ముద్దనూరు


రికార్డులను పరిశీలిస్తున్న డిఎస్‌పి వెంకటేశ్వరరావు

వివిధ కేసులకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు పక్కాగా నమోదు చేయాలని జమ్మలమడుగు డిఎస్‌పి వెంకటేశ్వరరావు సిబ్బందికి సూచించారు. స్థానిక యుజి పోలీస స్టేషన్ సోమవారం డిఎస్‌పి సాధారణ వార్షిక తనిఖీ నిర్వహించారు. పెండింగ్ కేసుల గురించి సిఐ దస్తగిరిని అడిగి తెలుసుకున్నారు. సిడి ఫైల్స్, పలు రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

చేనేతలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

చేనేతలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరణాల శివ నారాయణ కోరారు. సోమవారం స్థానిక పాత బస్టాండ్ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శివ నారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వం వివిధ రూపాల్లో మోపిన విద్యుత్, ఇతర భారాలను తగ్గిస్తామని, ఛార్జీలు పెంచబోమని 2024 ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కొన్ని నెలలకే సర్దుబాటు చార్జీలను రూ.6,072 కోట్ల విద్యుత్ భారాన్ని పెంచడాన్ని రద్దు చేయాలని కోరారు. ఇప్పటికే చేనేతలు నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుదలతో మరోపక్క ఉపాధి సన్నగిల్లి, మగ్గం పనులు జరక్క, ముడిసరుకులు ధరలు పెరిగి ఆదాయాలు తగ్గడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దాసు, పల్లా లక్ష్మి నారాయణ, ముని, రమేష్, మనోహర్ పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న చేనేత సంఘం నాయకులు

ఘనంగా సోనియాగాంధీ పుట్టినరోజు వేడుకలు


అన్నదానం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు విజయజ్యోతి

ప్రజాశక్తి - కడప

అన్ని దానాల్లో కల్లా రక్తదానం ఎంతో గొప్పదని, రక్తదానం నిండు ప్రాణాలను నిలబెడుతుందని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు అఫ్జల్ ఖాన్ అన్నారు. సోనియాగాంధీ జన్మదిన సందర్భంగా నగర అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పిసిసి అధికార ప్రతినిధి తులసి రెడ్డి, డిసిసి అధ్యక్షులు ఎన్.డి. విజయ జ్యోతి హాజరై సోనియా గాంధీ జన్మదిన సందర్భంగా కేక్‌ను కట్ చేసి అందరి పంచి పెట్టారు. కార్యక్రమంలో కడప అసెంబ్లీ కో-ఆర్డినేటర్ బండి జకరయ్య, పిసిసి ప్రధాన కార్యదర్శి అలీ ఖాన్, ఎఐసిసి కోఆర్డినేటర్ అబ్దుల్ సత్తార్, మల్లెం విజయభాస్కర్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు, మల్లెం విజయ భాస్కర్, సయ్యద్ సలావుద్దీన్, మైనుద్దీన్, హమీద్, కదిరి ప్రసాద్ గౌడ్, సిరాజుద్దీన్, ఇనామ్, గంగయ్య, హరిప్రసాద్, వెంకటరమణ, రహంతుల్లా, నాసిర్ ఖాన్, జహుర్, కమల్, ఆబిద్ ఖాన్, అబిద్ , మున్నా, అక్బర్, జబ్బార్, ఖాదర్‌ఖాన్, జార్జ్, సంధ్య, శ్యామల, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **పునరావాస కేంద్రంలో అన్నదానం..** సోనియా గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని డిసిసి అధ్యక్షులు ఎన్.డి.విజయజ్యోతి ఆధ్వర్యంలో పాత రిమ్స్‌లో ఉన్న ఆల్ షిఫా మానసిక వికలాంగుల పునరావాస కేంద్రంలో అన్నదానం నిర్వహించారు.

వేంపల్లె : కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు, రాజ్యసభ సభ్యురాలు సోనియా గాంధీ త్యాగానికి మారుపేరని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో సోమవారం కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ పుట్టిన రోజును నిరాడంబరంగా నిర్వహించారు. స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలోని అమ్మ అనాథ వృద్ధాశ్రమంలో పండ్లు, బ్రెడ్డు తులసిరెడ్డి పంచిపెట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, అమర్నాథ్‌రెడ్డి, చెన్నకేశవ, ఉత్తన్న, రమణ, నాగరాజు, వెంకటేష్, మహబూబ్ బాషా, బాలం సుబ్బరాయుడు, ఆరు సేర్ల సుబ్బరాయుడు, బద్రి, వేమయ్య, మదార్ పాల్గొన్నారు.

ఖాజీపేట : జాతీయ కాంగ్రెస్ పార్టీ అధినాయకురాలు సోనియాగాంధీ జన్మదిన కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ మాజీ చైర్మన్ గున్నంపాటి వెంకటరమణ ఆధ్వర్యంలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాషా పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : సోనియా గాంధీ 78వ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ధ్రువ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆమె జన్మదిన కేక్ కట్ చేసి వృద్ధులు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. అనంతరం లింగాల మండలం ఇప్పట్ల గ్రామ సమీపంలో ఉన్న లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకర్‌రెడ్డి, రాజారెడ్డి, సాయికుమార్, అశోక్, సురేష్, వినోద్, గౌస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

45 రోజుల్లో రైతు ఫిర్యాదులకు పరిష్కారం

ప్రజాశక్తి - ఖాజీపేట

రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను 45రోజుల్లో పరిష్కరిస్తామని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. మండల పరిధిలోని త్రిపురవరం గ్రామంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని, భూ సమస్యలను పరిష్కారించుకోవాలని ఎమ్మెల్యే రైతులను కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ మహబూబ్ బాషా, స్థానిక నాయకులు హరినాథ్‌రెడ్డి, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సదస్సుల పేరుతో రైతులను మోసగించడం తగదు

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ఇటీవల నుంచి ప్రభుత్వం రెవెన్యూ సదస్సుల పేరుతో రైతులను మోసగించడం తగదని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. కడప జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవితమ్మకు ఈ సందర్భంగా రాయలసీమ పరిరక్షణ సంఘం కోరుతోందన్నారు. రైతులకు మేలు జరిగే వాతావరణం లేదన్నారు. ముఖ్యమైన హంద్రీనీవా, గాలేరు నగరి ప్రాజెక్టులు అనంతపురం జిల్లాలో ఉన్నాయని, కడప జిల్లాకు ముఖ్యమైన రాజోలు రిజర్వాయర్ మిగతా ప్రాజెక్టులు ఉన్నాయని, వీటన్నింటిని పట్టించుకోకుండా రైతులకు మేలు చేస్తామంటే నమ్మడానికి రైతులు సిద్ధంగా లేరని ఆయన తెలిపారు.

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

పులివెందుల టౌన్ : స్థానిక చెన్నారెడ్డి కాలనీలోని యేసుక్రీస్తు ప్రార్థన మందిరంలో పులివెందుల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వైసిపి నాయకులు వైఎస్ మదన్మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గోటూరు చిన్నప్ప, పులివెందుల అర్బన్ సీఐ టి.నరసింహులు పాల్గొన్నారు. ముందుగా క్రిస్మస్ కేక్ కట్ చేసి ప్రజలకు ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అసోసియేషన్ సభ్యులకు నూతన వస్త్రాలను బహుకరించి అతిథులకు ఘనంగా విందు భోజనాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాస్టర్ ఉదయ్‌కిరణ్, పాస్టర్ దేవరాజు, పాస్టర్ కృపారాజు, క్రైస్తవులు పాల్గొన్నారు.

బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

బాలికలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఒ సునీత పేర్కొన్నారు. స్థానిక ఎపి మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు లైంగిక వేధింపులకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు జరగకుండా అవగాహన కలిగి ఉండాలని కోరారు. బాలికలు లైంగిక వేధింపులకు గురైతే 1098 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. పిల్లలకు కూడా జీవించే హక్కు, సమానత్వపు హక్కు, చదువుకునే హక్కు, భద్రత, సంరక్షణ హక్కులు ఉన్నాయని చెప్పారు. వాటిని రక్షించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం దానిమ్మ, నిమ్మ, బొప్పాయి మొక్కలను నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుగుణమ్మ, ఉపాధ్యాయులు అయేషా భాను, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్న, విద్యార్థినులు పాల్గొన్నారు.


హెచ్ఐవి నివారణకు ఎబిసి సూత్రాలు పాటించాలి

ప్రజాశక్తి - చాపాడు

హెచ్ఐవి నివారణకు ఎబిసి సూత్రాలు పాటించాలని డాక్టర్ ఓబులేసు తెలిపారు. స్థానిక పిహెచ్‌సిలో ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభి యాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం లింకు వర్కర్ స్కీం చైల్డ్ ఫండ్ ఇం డియా వారి ఆధ్వర్యంలో గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ హెచ్ఐవి వ్యాధిగ్రస్తులు మానసికంగా బాధ పడుతున్నారన్నారు. ఎయిడ్స్ గురించి తెలుసుకొని ఆరోగ్యంగా జీవిం చాలని సూచించారు. కార్యక్రమంలో సిహెచ్ఓ మహాదేవ్ యాదవ్, ఆరోగ్య విస్తరణ అధికారి ఎం.రాఘవయ్య, ఆశా నోడల్ పర్సన్ సుకన్య, సూపర్‌వైజర్స్ సరస్వతి, టి.ప్రసాద్, చైల్డ్ ఫండ్ ఇండియా ప్రతినిధి దర్బార్‌వలి పాల్గొన్నారు.

అన్నదానానికి దాతలు సహకరించాలి

ప్రజాశక్తి - చాపాడు


అన్నదాన కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ఇఒ మారుతి ప్రసాద్

అల్లాడుపల్లె వీర భద్రస్వామి దేవస్థానం ఆవరణలో ప్రతి సోమ వారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి దాతలు సహకరించాలని ఆలయ ఇఒ మారుతి ప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం భద్రకాళి సమేత వీరభద్ర స్వామి అన్నదాన సత్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్ర మానికి వెలుగు ఆనిమేటర్లు, అల్లాడుపల్లెకు చెందిన సాంబ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, ఎంఎల్ఎన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఎండి పెరుగు నారాయణ యాదవ్, గుత్తి వీరనారాయణ యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ వీరారెడ్డి, గుత్తి కిషోర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఆర్ఐటిలో లిఫ్ట్ ఇరిగేషన్‌పై సెమినార్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం బి.టెక్ సివిల్ విద్యార్థులకు లిఫ్ట్ ఇరిగేషన్ అనే అంశంపై ఐఎస్‌టిఇ సమన్వయముతో సివిల్ డిపార్ట్మెంట్ సెమినార్ సివిల్ హెచ్ఒడి సురేష్‌బాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్ నాగరాజుచే సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ హెచ్ఒడి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో నీటి అవసరాలు, డిమాండ్, సరఫరా గురించి వివరించారు. భవిష్యత్తు తరాలకు నీటిని ఆదా చేయడం, లిఫ్ట్ ఇరిగేషన్‌లోని వివిధ పద్ధతులను వివరించారు. చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకల్యాణ్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి సెమినార్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పాండురంగన్ రవి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరెడ్డి, హెచ్ఒడిలు, అధ్యాపకులు పాల్గొన్నారు.


పైపులైను లీకేజీతో వృథాగా పోతున్న నీరు

లీకేజీల నిర్వహణ పట్టదా..?

ప్రజాశక్తి - లింగాల

మండల పరిధిలోని చిన్నకూడల గ్రామ సమీపంలోని టిటిడి కల్యాణమండపం దగ్గర సోమవారం పార్నపల్లె సమగ్ర రక్షిత మంచినీటి పథకం నీటి పైపులైను లీకేజీ కావడంతో వందల లీటర్ల నీరు వృథాగా పోతోంది. వృథా నీటితో ఆ ప్రాంతం చిన్న పాటి చెరువును తలపిస్తోంది. అటుగా వెళుతున్న వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లీకేజీ కారణంగా ఎగువ ప్రాంత గ్రామాలకు నీరు సరఫరా కాలేదు. ఫలితంగా ఆ గ్రామల్లో నీటి సమస్య తలెత్తింది.

సిపిఎం మండల కార్యదర్శిగా షరీఫ్

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

సిపిఎం మైదుకూరు మండల కార్యదర్శిగా షేక్ షరీఫ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.శివకుమార్ తెలిపారు. సిపిఎం మైదుకూరు మండల 3వ మహాసభలు స్థానిక కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రాంగణంలో సోమ వారం ముగిశాయి. అనంతరం నిర్వహించిన సమా వేశంలో జి.శివకుమార్ మాట్లాడుతూ మహా సభల్లో 11 మందితో నూతన మండల కమిటీని ఎన్నుకున్నామన్నారు. మండల కార్యదర్శిగా షేక్ షరీఫ్, మండల కమిటీ సభ్యులుగా గురయ్య, కుమార్, బీబీ, లక్షుమయ్య, సుధాకర్, ఇమామ్, గంగమ్మ, వాసు, రాజశేఖర్‌ను ఎన్నుకున్నారు. 12 తీర్మానాలను మహాసభ ఆమోదించినట్లు వివరించారు. జనవరి 4,5 తేదీల్లో కడప నగరంలో జరిగే 12వ జిల్లా మహాసభలకు 12 మందిని ప్రతి నిధులను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. మండల సమగ్ర అభి వృద్ధి, రాజోలి రిజర్వాయర్ నిర్మాణం, ఉక్కు ఫ్యాక్టరీ సాధన, మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాలు, కేసీ ఉల్లి, పసుపు, ఎగుమతి దిగుమతి, కేంద్రం స్టోరేజ్ పాయింట్, పేదలందరికి ఇళ్లస్థలాలు, కూరగాయల మార్కెట్, మినీ ఆడిటోరియం ఏర్పాటు, పేదల నివాసాలకు పట్టాలు తదితర సమస్యలపై నూతన కమిటీ రాబోవు రోజుల్లో పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు.



రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి మంజూరు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల


మాడిశెట్టి శివ

స్థానిక ముద్దనూరు రోడ్డు పాతహాలు పక్కన వీధిలోఉన్న బ్రిడ్జికి అనుసంధానంగా అవతలికి పొడిగిస్తూ ఫుట్ ఓవర్ బ్రిడ్జి మంజూరైందని వైసిపి నాయకులు మాడిశెట్టి శివ తెలిపారు. ఆ మేరకు సోమవారం శివ మాట్లాడుతూ ఈనెల 5న బ్రిడ్జిని మంజూరు చేస్తూ గుంతకల్లు రైల్వే డివిజన్ నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. రైల్వేస్టేషన్‌కు ఇవతల వైపున ప్రభుత్వ ఆసుపత్రి, రెవెన్యూ కార్యాలయం, ఎంపిడిఒ, వ్యవసాయ కార్యాలయాలు, రాణివనం, ప్రకాష్ నగర్ ఉన్నాయని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం మూడేళ్ల క్రితం అప్పటి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని బ్రిడ్జి ఏర్పాటుకు తాము కలిశామన్నారు. ఆ మేరకు తాము ఎంపీ అవినాష్‌రెడ్డిని కలిసి స్థానిక సమస్యను వివరించామని తెలిపారు. ఎంపీ స్పందించి పలుమార్లు రైల్వేశాఖకు రాతపూర్వకంగా కోరారని వివరించారు. లిమిటెడ్ హైట్ సబ్ వే కోసం పలుమార్లు దరఖాస్తు చేశామని, ఇందుకు ఎంపీ తన నిధుల్లో దాదాపు రెండు కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. సబ్ వే నిమిత్తం రూ.4కోట్ల వ్యయం అవుతుందని రైల్వే అధికారులు తెలిపారని తెలిపారు. లిమిటెడ్ హైట్ సబ్ వే వస్తే బైకులు, ఆటోలు, ట్రాక్టర్లు రాకపోకలకు, ప్రజలకు రహదారి ఏర్పడి సౌకర్యంగా ఉంటుందని వివరించారు.

శ్రీ చైతన్య పాఠశాలకు అవార్డుల పంట

ప్రజాశక్తి - వేంపల్లె

జాతీయస్థాయి నృత్య వారోత్సవాల పోటీల్లో శ్రీ చైతన్య పాఠశాలకు నంది అవార్డులు వచ్చినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి చెప్పారు. రాజమండ్రిలోని రాజమహేంద్రవరంలో ఈనెల 7న శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో శ్రీశివసాయి కూచిపూడి కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి నృత్య వారోత్సవాల పోటీల్లో తమ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ చూపారన్నారు. పి.మిధునశ్రీ, ఎ.మనస్విత, కె.హిమబిందు, ఎస్.సిద్ధలక్ష్మి, ఎన్.అనిత, సి.గంగా వెన్నెల, ఎ.గణేష్, టి.బద్రీనాథ్, బి.బాలయోగి, ఎస్.సైపుల్లా ప్రతిభ చాటడడంతో వారికి నంది అవార్డులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల ఆవరణలో నాట్య గురువు చిన్న, విద్యార్థులను కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, డైరెక్టర్లు చేతన్‌రెడ్డి, చైతన్యరెడ్డి అభినందించారు. తమ పాఠశాలకు నంది అవార్డులు రావడం చాలా సంతోషకరమన్నారు.


అవార్డులు పొందిన విద్యార్థులతో కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి